
# కనిపిస్తే కన్నీళ్లతో...



"అమ్మా అని అరచినా ఆలకించవేమమ్మా
ఆవేదన తీరు రోజు ఈ జన్మకు లేదా?"

– పాట వింటున్న మధు మనసు బాధతో విలవిలలాడింది. 'పాండురంగ మహాత్మ్యం' సినిమాను ఎన్టీఆర్ అభిమానిగా ఐదుసార్లు చూశాడు చిన్నప్పుడు. కానీ, పెళ్ళయ్యాక మాత్రం ఆ సినిమా కథ పూర్తిగా మరచిపోయి ప్రవర్తించాడు.

అతని తల్లి మనసును మొదటిసారిగా బాధపెట్టిన సంఘటన గుర్తుకొచ్చింది అతనికి.

"అమ్మా... రేపటి నుంచి శ్యామల వంట చేస్తుంది. నీవు హాయిగా రెస్ట్ తీసుకో."

"అదేమిట్రా... అలా అంటావు? నాకప్పుడే రెస్టేంటి? శ్యామల- పాపం... ఉద్యోగం చేస్తోంది. వెళ్లేటప్పుడు హడావుడి! వచ్చేసరికి అలసట! నేను రోజంతా ఖాళీగానే ఉంటాను కదా! వంట చేయడానికి ఎంత కష్టపడాలి?!" సుభద్ర అంది.

"అదికాదమ్మా! శ్యామలకు నీ వంటలు నచ్చటం లేదు. అందుకే తను ఏమీ తినలేకపోతోంది. దయచేసి ఈ ఒక్క విషయంలో నా మాట విను."

దెబ్బతిన్నట్టు చూసింది సుభద్ర. కళ్ళనీళ్లతో తన గదిలోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆమె ఆ యింట్లో వంట చేయలేదు.

•

"ఓ తల్లీ! నిను నలుగురిలో నగుబాటు చేసితి
తలచకమ్మ తనయుని తప్పులు మన్నించవమ్మా!"

తమ్ముడి కూతురి పెళ్ళికని భర్తతో ఊరికి వెళ్లిన సుభద్ర నాలుగు రోజుల తర్వాత యింట్లో అడుగుపెట్టింది. కొడుకూ, కోడలూ యిల్లంతా పూర్తిగా మార్చేశారు. సోఫాలు, కుర్చీలు యింకా ఎన్నో కొత్తవస్తువులు కొన్నారు. కోడలి తల్లిదండ్రులు ఊర్నించి వచ్చి ఉన్నారు. వాళ్ళిద్దర్నీ పలుకరించారు సుభద్ర, సుబ్రహ్మణ్యంలు. తమ బెడ్‌రూమ్‌ని డ్రాయింగ్ రూమ్‌గా కొడుకు మార్చేయడం గమనించారు వాళ్ళు.

"అమ్మా! ఎలా ఉంది యిల్లు యిప్పుడు?" మధు అడిగాడు.

"చాలా బాగుందిరా! కాని, మధూ... బెడ్‌రూమ్ అలా..."

"ఇప్పుడు నేను మేనేజర్నయ్యాను కదమ్మా! ఇంటికి గెస్టులు, కస్టమర్లూ వస్తూపోతూ ఉంటారు. అందుకని మీ బెడ్‌రూమ్‌ని డ్రాయింగ్ రూమ్ చేసేశాను."

"మరి, మా యిద్దరి బెడ్‌రూమ్?"

"బెడ్‌రూమా?" పకపకా నవ్వసాగాడు మధు. "మీకింకా విడిగా బెడ్‌రూమ్ కావాలా అమ్మా?!" నవ్వు ఆపి, "మేడపై గది ఉందిగా! అందులో సర్దాను మీ మంచం, పరుపూ. ఎటూ మేమిద్దరం పైకి రాము కనుక మీకు కావలసినంత ఏకాంతం!" అంటూ మళ్లీ నవ్వసాగాడు. వియ్యంకుడూ, వియ్యపురాలు కూడా విరగబడి నవ్వసాగారు.

సుభద్రకు సిగ్గుతో చచ్చిపోయినంత పనయ్యింది. ఓ ప్రక్క కొడుకు తమ అనుమతి లేకుండా తమ గది మార్చాడన్న కోపం, మరోప్రక్క అతని ఎగతాళి ఆమెకు కంటనీరు తెప్పించింది. మేడ ఎక్కి మంచంపై వాలిపోయింది.

•

"కనుగానని కామమున యిలు వెడల నడిపితి
కనిపిస్తే కన్నీళ్లతో కాళ్లు కడుగుతా నాన్నా!"

"నాన్నా... మీరు వేరే యిల్లు చూసుకుంటే బాగుంటుంది!"

ముందు ఆశ్చర్యపోయాడు సుబ్రహ్మణ్యం. తర్వాత షాకు నుంచి తేరుకొని, "అలాగే... మధూ! కానీ, మావల్ల ఏమైనా పొరబాటు జరిగిందా?" అని అడిగాడు.

"ఛ... ఛ... చెప్పడానికి నాకే సిగ్గుగా వుంది. మరి, మీకు సిగ్గు ఎందుకనిపించటం లేదో నాకర్థం కావడం లేదు."

"అంత సిగ్గులేని పని మేమేం చేశామో కాస్త సెలవిస్తారా?"

"ఉదయం శ్యామల బట్టలు మార్చుకుంటుంటే గుడ్లప్పగించి చూశారట కదా! తనెంత సిగ్గుతో, బాధతో విలవిలలాడుతుందో తెలుసా?"

"మధూ... ఇక ఆపు. మేము యిల్లు వదలి వెళ్లిపోవడమే నీ కోరిక అయితే అలాగే వెళ్లిపోతాము. కాని, దయచేసి యిలాంటి అభాండాలేయకు. ఉదయం కూరగాయలు కొని మంచి ఎండలో నడచి యింటికొచ్చాను. ఇంట్లో చీకటికి కళ్ళు అలవాటు కాలేదు వెంటనే. నేరుగా వంటగదికి వెళ్లి సంచీ క్రింద పెట్టి అక్కడే కుర్చీలో కూర్చున్నాను అలసట వల్ల. తర్వాత చూస్తే శ్యామల చీర మార్చుకుంటోంది. నేను లేచి పైకి వచ్చేశాను. శ్యామల నా కూతురు లాంటిది."

"అలా భావిస్తే చాలదు... అలా ప్రవర్తించాలి."

"ఒరేయ్ః... మధూ! నీవంటూంటావేః... 'నేను మేనేజరుగా ఏ బ్రాంచిలో చేరినా నాలుగురోజుల్లో ఎవరెటువంటివారో కనుక్కోగలనని! మరి, నన్ను ముప్పై ఐదు ఏళ్లుగా ఎరుగుదువే- నేనెలాంటి వాడినో నీకు తెలియదా?" కళ్ళనీళ్లతో ప్రశ్నించాడు సుబ్రహ్మణ్యం.

మధు ఏం జవాబివ్వలేదు.

"సరే... నీవు కోరినట్లే నేనూ, మీ అమ్మా యిల్లు వదిలి వెళ్లిపోతాము. మాకు సమస్యలు పరిష్కరించడమే తెలుసు కాని, సృష్టించడం తెలియదు. నాకు రెండురోజులు గడువివ్వు!" అర్థించాడు కొడుకుని.

●

"మారిపోతినమ్మా నా గతి ఎరిగితినమ్మా
నీ మాట దాటనమ్మ ఒకమారు కనరమ్మ!
మాతాపిత పాదసేవే మాధవ సేవేయని మరువనమ్మా
నన్ను మన్నించగ రావమ్మా... అమ్మా... అమ్మా!"

నిజమే... తన గతేమయిందిప్పుడు? శ్యామల లుకేమియాతో చనిపోయింది. ఆమె వైద్యం కోసం ఆఫీసులో, ఊర్లో ఎన్నో అప్పులు చేశాడు. అయినా ఫలితం లేకపోయింది. తను, రెండేళ్ల కూతురు మిగిలారు. ఊర్లో అప్పులు మిగిలాయి.

ఈ జన్మలో చేసిన పాపాలకు ఫలితం ఈ జన్మలోనే అనుభవించడం జరిగింది. ఇప్పుడు పశ్చాత్తాపపడి ఏం లాభం? భార్య మాటలు విని దేవతల్లాంటి తల్లిదండ్రుల్ని అవమానించాడు... ఇంటి నుంచి వెళ్లగొట్టాడు.

అయితే తనకు యిప్పటికీ ఆశ్చర్యం కలిగించే విషయం ఒకటుంది- తను యింటి నుంచి వెళ్లిపొమ్మంటే యిది తన కష్టార్జితంతో కట్టుకున్న యిల్లనీ, తమతో ఉండటం యిష్టం

లేకుంటే నీవే వెళ్లిపోవాలని తనతో తండ్రి అనకపోవడం! 'పితృదేవో భవ!' అంటే అర్థం యిప్పుడు తెలుస్తోంది తనకు.

శ్యామల పోయాక తల్లిదండ్రుల గురించి వాకబు చేశాడు. వాళ్ళు వేరే యింట్లో చేరలేదని, ఊరు వదిలి వెళ్లిపోయారని తెలిసింది.

●

ఫోన్ మ్రోగితే రిసీవర్ తీసి "హలో..." అన్నాడు మధు.

"ఒరేయ్ః మధూ... నేను రవిని! నేనూ, నా భార్య నిన్నే కాశీకి వచ్చాము. ఇక్కడ మీ అమ్మానాన్నా కనిపించారు. శ్యామల పోయిన విషయం విని చాలా బాధపడ్డారు. వాళ్ళని నేను చూసిన విషయం నీకు చెప్పవద్దని మాట తీసుకున్నారు. కానీ, వాళ్ళ ఆరోగ్యం ఏం బాగాలేదురా! నన్నేం చేయమంటావు?"

"అమ్మానాన్నా కనిపించారా?" ఆనందంతో అరచినంత పనిచేశాడు మధు. "రవీ! నీవు వాళ్ళతోనే ఉండు. నేను నిన్నెక్కడ కలవాలో చెప్పు. నేను ఫ్లైట్‌లో ఎక్కైనా వచ్చి నిన్ను కలుస్తాను. నా ప్రాణాలిచ్చైనా సరే... అమ్మానాన్నల్ని బ్రతికించుకుంటాను. రవీ... దయచేసి వాళ్ళని చూస్తుండరా ప్లీజ్!"

మధు మనసు ఆనందంతో, ఉద్వేగంతో నిండిపోయింది. తన కన్నీళ్లతో తల్లిదండ్రుల కాళ్లు కడగటానికి, వాళ్ళ క్షమాభిక్ష కోరడానికి అతడు బయలుదేరుతున్నాడు.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... **21** ఫిబ్రవరి' **2002**

తమ రచనలను పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న ఆసక్తి, అభిలాష
ఉండికూడా ప్రచురణకి అయ్యే ఖర్చుని చూసి వెనుకంజ వేస్తున్న
వర్ధమాన, అనుభవజ్ఞులైన రచయితలకు ప్రచురణ వ్యయంలో వెసులుబాటును కల్పిస్తూ...

**జయంతి పబ్లికేషన్స్**

రూపొందించిన ప్రచురణ విధానాల గురించిన పూర్తి వివరాల కోసం
రూ॥ 5/- స్టాంపు అంటించిన కవరును జతపరచి మా అడ్రసుకి వ్రాయండి.